సూర్యుడి వయస్సుతోనో, సముద్రం వయస్సుతోనో పోల్చి చూస్తే పదేళ్ళ కాలం చాలా తక్కువ సమయమే అయినా, మనిషి జీవితంలో పదేళ్లంటే చాలా ఎక్కువే కదా! పదేళ్ళ జీవితాన్ని నెమరు వేసుకుంటూ రొమాంటిక్‌గా గడపడానికి పెట్టే నాలుగు వేలు ఖర్చు ఖర్చా!? అయితే పెళ్ళి చేసుకుని పోగొట్టుకున్నది ఎక్కువా? పొందింది ఎక్కువా?

# ఓ దశాబ్దం

## అనామకుడు



''ఎంత బావుందో'' అన్నాడు రామం. నీలం రంగు సముద్రం లోంచి ఎర్ర రంగు సూర్యుడు నెమ్మదిగా పైకి రావడాన్ని చూస్తూ.

''ఏమిటి?'' అంది సీత ఆ దృశ్యాన్ని చూస్తూ.

''మనం ఇలా రావడం'' అన్నాడు రామం.

''బావుండక ఏం చేస్తుంది? మొత్తం నాలుగు వేలవుతోందా ఖర్చు?'' అంది సీత.

''సీతా! ఈ రోజు కూడా డబ్బు గురించేనా? ఒక్క రోజు ఈ ఒక్క రోజు కాస్తంత రొమాంటిక్‌గా ఉండలేవూ?''

''ఈ ఒక్క రోజేం - పదేళ్ళుగా ప్రతి రోజూ రొమాంటిక్‌గా ఉండాలనే అనుకుంటున్నాం - కుదిరితే కదా?''

''కుదరకపోవడానికి ఏమయింది?''

''అయిపోయిన విషయాల గురించి ఇప్పుడు మాట్లాడుకోడం ఎందుకు?''

''ఇప్పుడు కాక ఇంకెప్పుడు మాట్లాడుకుంటాం. ఇలా మన పదేళ్ళ వివాహ జీవితాన్ని నెమ్మదిగా నెమరువేసుకుందుకే కదా - మనం ఇంత ఖర్చు పెట్టి ఇలా వచ్చాం''.

''ఏం ఖర్చు గురించి మాట్లాడుతున్నారేం? కాస్త - కాస్తంటే కాస్త రొమాంటిగ్గా మాట్లాడలేరా?''

''అదొదిలెయ్యి, రొమాంటిక్‌గా ఉండాలని గత పదేళ్ళుగా అనుకుంటూ అలా ఉండలేక పోవడానికి కారణం ఏంటి?''

''మీరు రొమాంటిక్‌గా ఉండలేకపోవడానికి కారణం ఏంటి?''

''నేనా, నేను రొమాంటిక్‌గానే ఉంటున్నా''

అంతే - ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది.

అది వాళ్ళిద్దరికీ పదేళ్ళుగా అలవాటే.

పదేళ్ళ క్రితం సరిగ్గా ఈరోజే సీతకీ రామానికీ పెళ్ళయింది.

వాళ్ళిప్పుడు చూస్తున్న సూర్యుడి వయస్సుతోనో, సముద్రం వయస్సుతోనో పోల్చి చూస్తే, పదేళ్ళ కాలం చాలా తక్కువ సమయమే అయినా, మనిషి జీవితంలో పదేళ్లంటే ఎక్కువే.

వాళ్ళిద్దరికీ పెళ్ళి జరుగుతుందని, వాళ్ళిద్దరి పెళ్ళి జరగడానికి ముందు నుండే వాళ్ళకి తెలుసు.

అయితే సిగ్గుతో, సీతా, మొహమాటంతో రామం - ఒకరితో ఒకరు ఎక్కువ మాట్లాడుకోలేదు.

ఆ తరువాత - పెళ్ళయిన తర్వాత - పదేళ్ళుగా వాళ్ళు కొంచెం సేపు మాట్లాడుకోవడం - ఆ తరువాత కొంతసేపు మాట్లాడుకోకపోవడం - మళ్ళీ మాట్లాడుకోవడం చేస్తూనే ఉన్నారు.

పెళ్ళిరోజు - అదే ఓ దశాబ్ద వివాహ జీవితానికి తర్వాత వచ్చిన పెళ్ళిరోజు - చాలా ఆనందంగా గడుపుదామనుకున్నారు. అయితే ఆనందంగా గడపడమంటే ఏమిటన్న విషయం మీద ఇద్దరికీ అభిప్రాయ భేదం వచ్చింది.

''మా అమ్మా నాన్నల దగ్గరకి వెళ్దాం'' అంది సీత.

''పెళ్ళయ్యి పదేళ్ళయింది. ఆనందమైనా, దుఃఖమైనా మొగుడున్న వాడితో పంచుకోవాలనుండదు నీకు, ఏమన్నా అంటే చాలు, మా అమ్మానాన్నల దగ్గరకెళ్దాం అంటావు. నేనక్కడకు రాను. ఇద్దరం ఆఫీసులకి సెలవు పెట్టేద్దాం, మార్నింగ్‌షోకి వెళ్దాం, ఆ తర్వాత ఏదన్నా హోటల్లో లంచ్, సాయంత్రం పార్కులో కొంతసేపు కూర్చున్నాక ఫస్టుషో సినిమా, రాత్రి మళ్ళీ హోటల్ డిన్నర్. ఎలాగుంది ఆలోచన?''.

''పెళ్ళి రోజున కూడా ఈ ఊరేనా? ఆరోజు నేను ఈ ఊళ్ళో ఉండను కాక ఉండను''

''ఆ రోజు మీ అమ్మా నాన్నల ఊరికి నేను రానుకాక రాను''

అని అనుకున్న వాళ్ళిద్దరూ అటు సీత మాటా, ఇటు రామం మాట కాకుండా పెళ్ళిరోజుకి ముందు రోజు విశాఖపట్నం వచ్చారు. సముద్రం ఒడ్డునున్న హోటల్ రూంలో దిగారు.

రాత్రి పడుక్కుని లేచి, హోటల్‌గది బాల్కనీలో కూర్చుని సముద్రాన్ని చూస్తూ మాట్లాడుకోవడం మొదలెట్టి, మధ్యలో నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు.

కొంచెం సేపు అలా నిశ్శబ్దంగా ఉన్నాక కొంచెం బాధ ధ్వనిస్తున్న కంఠంతో

రామం -

''నేను మెటీరిలిస్ట్‌ని కాదు సీతా. కుటుంబం కోసం డబ్బు సంపాదించక తప్పదు కదా - అందుకే ఆఫీసుకెళ్లడం. అదే పది తరాలకు సరిపడా ఆస్తి ఉందనుకుందాం మనకు - నేను ఈ ఆఫీస్ రొటీన్ చక్రంలో ఇరుక్కునే వాడినా? ఇలా సూర్యోదయాన్ని చూస్తూనో, కృష్ణశాస్త్రి కవిత్వం చదువుతూనో, ఘంటసాల పాటలు వింటూనో కాలం గడిపేవాడిని కాదూ - నీ ఒళ్ళో తలపెట్టుకుని పడుక్కుని'' అన్నాడు.

కొంతసేపు నిశ్శబ్దం తరవాత ఎవరో ఒకరు మళ్ళీ మాటలు మొదలెట్టడం, వెంటనే రెండవ వాళ్ళు మాట్లాడ్డం వాళ్ళిద్దరికీ కొత్త కాదు. ఇన్నేళ్ళ ఈ ఆనవాయితీకి అడ్డం రాకుండా సీత -

''నాకు మాత్రం పుస్తకాలు చదవడం ఇష్టం లేకనా. పదేళ్ళ క్రితం వరకూ నేను ముళ్ళపూడి వారి పుస్తకాల్లోనో, మంగళంపల్లివారి సంగీతంలోనో మునిగి ఉండేదాన్ని.

రామం నవ్వి ''నీ ఇష్టాల్లోనే ఏదో లోపం ఉంది సీతా, హాస్యం రాసుకునే ముళ్ళపూడి వెంకట రమణ, గంభీరంగా శాస్త్రీయ సంగీతం పాడే మంగళంపల్లి బాల మురళీకృష్ణ, ఇద్దరినీ సమానంగా మెచ్చుకునే నిన్నేమనగలను'' అన్నాడు జాలిగా.



సీత కోపగించుకుంది. సీత కోపగించుకున్నట్లు తెలియడం కష్టం. సీత కళ్ళూ, పెదవులూ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాయి. సీత ముక్కు అందంగా, పొడవుగా, పైకి లేచినట్లున్న ముక్కు - కొంచెం ఎర్రబడినట్లు కనిపిస్తే సీతకి కోపం వచ్చినట్లు. సీత బుగ్గలు కెంపుల్లా, పెదవులు పగడాల్లా ఎల్లవేళలా ఎర్రగానే ఉంటాయి. మామూలుగా, తెల్లగా నునుపుదేరి ఉన్న ముక్కే, కోపం వచ్చినపుడు మాత్రం కొంచెం ఎర్రగా అవుతుంది. ఇది రామానికి తెలుసు.

ఆ కోపంలోనే సీత -

''మీరు నా తెలివితేటల్నీ, నా ఇష్టాన్నీ విమర్శిస్తే నాకేంగానీ, ముళ్ళపూడి వారిని హాస్యం రాసుకునే రచయిత అనడం - నాకేమాత్రం నచ్చలేదు. ఆయన రచనల్లో పైకి కనిపించేది హాస్యమే కానీ, ఆ హాస్యం వెనుక బోల్డు సైకాలజీ, వాటికింకా వెనుక ఫిలాసఫీ దాక్కుంటాయి. పుస్తకాలు చదవడమంటే పేజీలు తిరగేసే వాళ్ళకి ఏం అర్థమవుతాయి లెండి ఆయన రచనలు'' అంది.

''ఈ రోజు నీతో రచనల గురించీ, రచయిత గురించీ సుదీర్ఘమైన చర్చ చేసేందుకు సమయం లేదు. మనం ఇక్కడికొచ్చింది మన పదేళ్ళ జీవితం గురించి మాట్లాడుకుందికి. నీకు గుర్తుందో లేదో - పెళ్ళయిన వారం రోజులు కూడా కాలేదు - కొత్త దంపతులం మనం - అప్పుడు మనం మద్రాసులో ఉండే వాళ్ళం - ఓ సాయంత్రం ఇలానే బీచ్‌కి వెళ్ళి కూర్చున్నాం. ఆ రోజు పున్నమి. చంద్రోదయం అద్భుతంగా ఉంది. దాన్ని నేను చూస్తోంటే - '' అంటూ ఆగి, సీతని జాలిగా చూసి మళ్ళీ రామం -

## నెల నెలా యువ కథకుల సమాలోచనమ్!

యువ కథకులు తమ ఆలోచనా పరిధిని విస్తృత పరచుకొని మంచి కథకులుగా ఎదగడానికి దోహదపడే విధంగా ప్రతీ నెలా నాలుగో ఆదివారం ఉదయం *10 గం.లకు ''సిటీ సెంట్రల్ లైబ్రరీ, అశోక్ నగర్, హైదరాబాద్''లో* ధారావాహిక సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఒక సీనియర్ కథా రచయిత తమ అనుభవాలను వివరించడం, సదస్యుల ప్రశ్నోత్తరాలకు జవాబులు, ముఖ్యంగా సాహిత్యాభిమానులు నలుగురూ ఒక చోట చేరి వారి వారి అభిప్రాయాలను ఇచ్చి పుచ్చుకోవడం ముఖ్యోద్దేశాలు. రచయితలే కాకుండా, రచనాభిమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోగలరని ఆశిస్తున్నాము. - సం.

**నిర్వహణ : శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ & రచన ఇంటింటి పత్రిక**

''నువ్వు దూరంగా మల్లెపూలు అమ్ముతున్న వాడినే చూస్తూ కూర్చున్నావు'' అన్నాడు.

''అయిందా, మీకంతవరకే గుర్తుంది. ఆ మల్లెపువ్వులవాడు మన దగ్గరకు వచ్చాడు. పెళ్ళయిన కొత్తలో నేను నా దగ్గర బాగ్ ఉంచుకునే దాన్ని కాదు. నా దగ్గర డబ్బు లేదు. మీరు పువ్వులు కొంటారేమోనని చూశాను. వాడిని అరవంలో - నాకు రాని భాషలో తిట్టి - తరిమేశారు. పక్కనున్న భార్యకి మల్లెపువ్వులు పెట్టుకోవాలని ఆశ ఉంటుందని తెలియదు. పోనీ అడిగి తెలుసుకోవాలనైనా అనిపించ లేదు.''

''నేను చంద్రోదయం వేళ సముద్ర అలలపై ఉన్న వెండి వెన్నెలని చూడ్డంలో నిమగ్నమైపోయి ఉన్నాను. ఆ మల్లెపూల వాడితో బేరమాడ్డం అపుడు నా మనసుకు నచ్చిన పని కాదు''.

''అసలు బేరమాడాల్సిన అవసరమేముంది?'' ఓ మూర ఇమ్మని డబ్బివ్వడమే. ఉహుం! అలా చెయ్యలేదు మీరు. వినీల గగనంలో పున్నమి చందమామే కాదు, వినీల కుంతలాల్లో తెల్లని మల్లెలు కూడా అందంగానే ఉంటాయి, అనే విషయం మీకు ఆనాడే కాదు - ఈనాటికీ కూడా తెలియదు. పదేళ్ళలో ఒక్కసారి కూడా కొనలేదు మీరు మల్లెపూలు.''

''నువ్వు కొనుక్కుంటున్నావుగా, రోజుకి ఒకటేం, నాలుగు మూరలు''.

''అప్పట్నుండీ, నేను నా దగ్గర డబ్బులుంచుకుంటూనే ఉన్నాను.''

''డబ్బు సంపాదిస్తున్నావుగా, ఉంచుకుందుకేం''

''మీ కళ్ళెప్పుడూ నా సంపాద మీదే'' అంది సీత రామం వైపు చూడకుండా.

''నా వైపు చూసి, నా కళ్ళల్లోకి చూస్తూ - ఆ మాట చెప్పు. నేను నిన్ను సంపాదించి పెట్టమన్నానా? నా సంపాదన మనకి సరిపోతుందని అనలేదూ. నువ్వే, నేనేం చదువుకోని దాన్నా, ఇంట్లో కూర్చుని అరటికాయ ముచికతో నేల మీద తప్పుడు లెక్కలు రాస్తూ కూర్చోవడానికి, అంటూ ఉద్యోగంలో చేరావు. నీ డబ్బు - నేనొక్క పైసా, ఒక్క పైసా తీసుకున్నానా, నిజం చెప్పు.''

''వాడుకోలేదు. అయితే నేను వాడుకుంటున్నానా నా సంపాదనని? అందులో ఒక్క పైసా నేను ఖర్చు చెయ్యడం లేదు''.

''ఏం నేనేం చేసుకోవద్దనలేదే''

''మీరు చేసుకోమని కూడా అనలేదే''

''నువ్వు ఉద్యోగం చేస్తున్నది - సంపాదిస్తున్నది - నీకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండడం కోసం - మరి నేను చేసుకోమని చెప్పేదాకా ఖర్చు చేసుకోకపోతే అదేం స్వతంత్రం.

''ఎప్పుడన్నా ఒక్కసారి - ఒక్కసారి - సీతా నీ జీతమంతా బ్యాంక్‌లోనే ఉంది. అందులోంచి ఓ పదివేలు తీసుకుని నెక్లెస్ కొనుక్కో అంటావేమోనని చూశాను. ఉహుం'' అంది సీత.

అలా అంటున్న సీత కంఠంలో బాధ లేదు.

సీత కంఠంలో నిష్ఠూరమూ లేదు.

''నీ డబ్బుతో, నువ్వు సంపాదిస్తున్న డబ్బుతో నేను నిన్ను కొనుక్కోమనాలా? అసలవేం మాటలు సీతా - నువ్వు కొనుక్కోలేవూ?''

''నేనలా తీసుకుని కొనుక్కోలేను''.

''నీకు నువ్వు కొనుక్కోలేవు. అంతే కాదు. మనకి కావల్సింది కూడా కొనలేవు. ఓ సారి గుర్తుందా, వి.సి.ఆర్. కొందామనుకున్నాను. అయితే ఓ నాలుగు వేలు తక్కువయ్యాయి. బాంక్‌లో నా డబ్బుంది కదా, తీసుకుని కొందాం అన్నావూ? అన్లేదు.''

''అది నా డబ్బని నేననుకోలేదు. ఇప్పుడూ అనుకోవడం లే. ర్థిక వ్యవహారాలు చూడాల్సిందీ, చూసుకునేదీ మీరే. అందుకే నేనేం చెప్పలేదు. అసలు చెప్పాలన్న ఆలోచనే కలగలేదు'' అంది అమాయకంగా చూస్తూ సీత.

పెళ్ళయి పదేళ్లయినా - ఏ మాత్రం తగ్గని అమాయకత్వం సీత మోహంలో అద్భుతంగా కనిపించింది.

ఆడవాళ్ళ మోహాల్లో అమాయకత్వం అద్భుతంగా కనిపిస్తుంది.

మగాళ్ళని మగాళ్ళుగా గుర్తించే వరకూ ఆడపిల్లల్లో అమాయకత్వం ఉండడం సహజమే. అందుకే పదహారేళ్ళ వయసులో అమ్మాయిలు అందరూ అందంగానే ఉన్నట్లుంటారు.

అయితే సీతలో ఆ అమాయకత్వం పాలు తగ్గనే లేదు. అందుకే అందంగా ఉండే సీత అమాయకత్వపు ''మేలి ముసుగు''తో ఇంకా అందంగా సాలార్ జంగ్ మ్యూజియంలోని 'వీలిడ్' రెబేకాలా ఉంది.

''ఎంత బావున్నావ్ సీతా'' అన్నాడు రామం.

''ఎంత?'' అంది సీత.

''నీ జడంత''

''అంతేనా'' అంది నిరుత్సాహపడినట్టుగా సీత.

''అంతకన్న పొడవైంది, అందమైంది ఇంకోటి ఏముంది?'' అన్నాడు రామం.

నవ్వింది సీత.

నవ్వేశాడు రామం.

''నా వల్లే కదూ మీకు కష్టాలు. నన్ను పెళ్ళి చేసుకోకపోయి ఉంటే మీరు పాటలు వింటూ, కవిత్వం చదువుకుంటూ హాయిగా కాలం గడిపేసేవారు కదూ?'' అంది సీత, ఇందాక రామం అన్న మాటల్ని మర్చిపోలేనట్లు.

''నీ కోసం ఆ మాత్రం త్యాగం చెయ్యలేనా'' అన్నాడు రామం.

''నాకోసం మీరేం త్యాగం చెయ్యక్కర్లేదు. మీకు కావలసినట్లు మీరుండండి. అప్పుడెప్పుడో - పదేళ్ళ క్రితం - చేసిన తప్పుకి, తెలియక చేసిన తప్పుకి, నన్ను భరించక తప్పదు అనుకోకండి. నేను మిమ్మల్ని విసిగించను. మీ జోలికి రాను. మీకు కావల్సినట్లు మీరుండండి'' అంది సీత.

వెంటనే రామం - ''నేనూ నీ జోలికి రాను. అసలు నీతో అనవసరంగా మాట్లాడాను. నువ్వూ నీ కిష్టమైన పనులు చేసుకో. నీకెంతో కోరికగా ఉందికదా, ఎమ్మే ప్రైవేటుగా కట్టి చదువుకో'' అన్నాడు.

''అదే మీకు కావల్సింది - నాతో ఏదో తప్పనిసరి కాపురం చేస్తున్నట్లుంటారు మీరు. నాతో మాట్లాడకపోతే నేనేం అనుకుంటానో అని మాట్లాడుతారు - కానీ మీకిష్టమై కాదు.

అంటున్న తన మాటలకి అడ్డొస్తూ -

''అదేం కాదు సీతా!'' అని రామం అంటున్నా వినకుండా సీత.

''నేనేం ఈ రోజు ఎమ్మే చదవను. పెళ్ళయిన కొత్తలో, ఏ పనీ లేకుండా - ఇంట్లో కూర్చున్న రోజుల్లో యూనివర్సిటీకి వెళ్ళి చదువుకుంటానంటే.- ఆ చదువు ఎందుకు సీతా - మన ఇద్దరం కలిసి నేర్చుకోవలసిన జీవిత పాఠాలు ఎన్నో ఉన్నాయంటూ ఆపించేశారు. ఈ రోజు నాకు ఊపిరి పీల్చుకునేందుకు కూడా సమయం లేదు - ఎమ్మే చదవనా?''

''ఏమంత ఊపిరి పీల్చుకోలేనంత పనులు నీకు. అన్నిటిలోనూ నీకు నేను సాయం చెయ్యడం లేదూ? నువ్వు ఎమ్మే చదవలేకపోయానని అంటావే కానీ - మొదలెట్టిన ఎం బీ యే పెళ్ళవ్వగానే నేను మానేశాను కదా! అది నువ్వు గుర్తించావా?''

''నేనేం మానెయ్యమనలేదు. మీరే మానేశారు''.

''ఎందుకు మానేశాను - సాయంత్రాలు క్లాసులకి వెళ్తాను అని నేననేసరికి, నీ మొహంలో ప్రపంచంలోని బాధంతా కనిపించేసేది. ఇంక నేనెలా వెళ్ళగలను?''

''మిమ్మల్ని వెళ్లమని నేననలేదూ?''

''అన్నావు. వెళ్ళమని నోటితో అన్నావు - అయితే నీ కళ్ళున్నాయే - కళ్ళు - అవి దీనంగా 'వెళ్ళొద్దు' అనేవి.''


''నా కళ్ళేమనేవో నాకేం తెలుసు. పోనీ ఇపుడు చెయ్యండి - ఎం బి ఏ - మీరు నా కోసం చదువు మానుకోడం ఎందుకు. ఈ సంవత్సరమే చేరండి. నన్ను పెళ్లి చేసుకుని మీరు మీ చదువు మానుకోడం నాకిష్టం లేదు'' అంది సీత కంఠంలో బాధనీ, కళ్ళలో తడినీ కనపరుస్తూ.

''ఛ ఛ నీ వల్లకాదు నేను మానేసింది. నిన్ను వదిలి వెళ్ళడం నాకూ ఇష్టం లేదు. అప్పుడు కాదు, ఇప్పుడు కూడా''.

''నేను ఎమ్మే మానేసింది కూడా అందుకనే. ఎమ్మే అంటే రాత్రిళ్ళు చదువుతూ కూర్చోవాలి'' అంది సీత తల కొంచెం వంచుకుని, కళ్ళని వాల్చేస్తూ.

మూసిన సీత కళ్ళనే చూస్తూ రామం - ''ఇంత వరకూ విరిసిన పువ్వులా ఉన్న నీ కళ్ళు, నువ్వలా ముయ్యగానే మొగ్గల్లా కనిపిస్తున్నాయి. పువ్వుకి పువ్వూ, మొగ్గకి మొగ్గా అందంగా ఉంటాయి. అలానే నీ కళ్ళూనూ. కళ్ళు మూస్తే మొగ్గలు, తెరిస్తే పువ్వులూను'' అన్నాడు.

సీత ఒక కన్ను మూసి ఉంచి, ఓ కన్ను తెరిచి ఉంచి రామాన్ని చూసి




నవ్వింది.

''ఎంత తెలివైనదానవు సీతా'' అన్నాడు రామం.

''ఎంత?'' అంది సీత.

''నీ అందమంత''

''అదెంత''

''నీ - '' అని మొదలెట్టాడు రామం.

'' - జడంత'' అని పూర్తిచేసింది సీత.

''ఏమయితేనేం, పెళ్ళి మూలంగా నువ్వు చెయ్యాలనుకున్న ఎమ్మే పూర్తి చెయ్యలేకపోయావు. అది పూర్తయి ఉంటే ఏ కాలేజీ లెక్చరర్‌వో అయ్యుండేదానవు - ఈ కంపెనీలో స్టెనోగా కాకుండా.''

''నా ఉద్యోగం నాకేం చిన్నతనంగా లేదు. మీకే మీ ఆవిడ స్టెనో అని చెప్పుకోవడానికి కష్టంగా ఉందేమో.''

''అహం, నా ఉద్దేశ్యం అది కాదు - ఏవో చేద్దామనుకుని పెళ్ళి కారణంగా చెయ్యలేకపోయావే అని''.

''ఎన్నో అనుకుంటాం, అన్నీ సాధించగలుగుతామా''

''అవును ఎన్నో అనుకుంటాం. అన్నీ సాధించలేం''

''నేనే కాదు, పెళ్ళయ్యాక ఆడవాళ్ళందరూ అంతే ఏమీ చెయ్యలేర్లు''.

''నువ్వు నీ ఫెమినిస్టు కళ్ళద్దాలు తీసెయ్యి. పెళ్ళయ్యాక ఆడాళ్ళూ మగాళ్ళూ ఇద్దరూ ఏమీ చెయ్యలేరు'' అని రామం మాటలకి -

''కాపురం తప్ప'' అని చేర్చింది సీత.

''పదేళ్ళలో ఏం సాధించాం'' అన్నాడు రామం ఎక్కడో ఆలోచిస్తున్నట్లుగా.

''ఒకరి నొకరం సాధించుకున్నాం'' అంది సీత.

''అది పెళ్ళికి ముందు - పెళ్ళి చేసుకున్నాక?'' అన్నాడు రామం.


''నే ననేది పెళ్ళి చేసుకున్నాకే'' అంది సీత.

అర్థం కానట్టు చూశాడు రామం.

''అర్థం కాకపోతే వచ్చిన నష్టమేమీ లేదు'' అంది సీత.

''ఓహో నువ్వనేది మనం ఒకరి నొకరం సాధించుకుంటున్నామనేగా'' అన్నాడు రామం. అవుననలేదు సీత. కాదనీ అనలేదు.

సూర్యుడు పూర్తిగా ఉదయించి, ఎండ బాల్కనీలోకి రావడం మొదలయ్యింది.




ఇద్దరూ మాట్లాడకుండా కూర్చుని ఉన్నారు.

''ఏం సాధించాం అని ఆలోచిస్తున్నారా'' అంది సీత కొంతసేపయ్యాక.

''పదేళ్ళ జీవితంలో - ఓ చిన్న ఇల్లూ, ఓ బుల్లి కారూ, వాటిని సాధించేందుకు చేసిన అప్పులూ - సాధించ లేదూ'' అన్నాడు రామం.

''అంతేనా, ఎన్ని మర్చిపోలేని అనుభవాల్ని సాధించాం. మనం కలిసి ఉండడం మొదలెట్టిన మూడో రోజునే నాకు జ్వరం వస్తే, మీరు నాకోసం పడిన శ్రమా, బాధా - '' అంది సీత.

''నా కోసారి కాలికి దెబ్బతగిలి, నాలుగు రోజులు కదల లేకపోతే నువ్వు '' అన్నాడు రామం.

''నేను మా ఇంటికి వెళ్ళి వచ్చిన ప్రతీసారీ స్టేషన్లో నన్ను దగ్గరకు తీసుకుంటున్న మీ మొహంలో ఆనందం ... ''

''సాయంత్రం నేనింటికి రాగానే నీ మొహంలో కనిపించే వెలుగు .. ''

''రాత్రిళ్ళు దూరంగా పడుక్కున్నట్లే పడుక్కుని, నిద్రలో తెలియకుండా వేసినట్లు నా మీద వేసిన చెయ్యి .. ''

''స్నానం చేస్తూ, నన్ను బాత్రూంలోకి పిల్చి, నా మీద కూడా నీళ్ళు పోసేసి, హాలు తలుపు తెరిచే వుందని నేనన్నప్పుడు మీరు పడ్డ హడావిడీ ...''

''ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో .. ఎన్నెన్నో ... '' అంది సీత నిట్టూరుస్తూ.

''కొంతేదో పోయినట్టుంది .. కొంతేదో వచ్చినట్లుంది'' అన్నాడు రామం.

''పోయిందీ - వచ్చిందీ - జీవితం ఎక్కడ వేస్తే అక్కడే ఉన్నట్లుం '' అంది సీత కళ్ళుమూసుకుని.

''కాదు'' అన్న అరుపు వినిపించి ఇందాక ఎప్పుడో మూసిన కళ్ళు తెరిచింది సీత.

అయితే ఆ అరుపు రామంది కాదు.

గది లోంచి చిన్నాడి గొంతది. వాడు చిన్నాడే కానీ, వాడి గొంతు పెద్దదే.

పెద్ద పిల్లా, వాడూ లేచి ఏదో కీచులాడు కుంటున్నారు లాగుంది, అని సీత అనుకుంటూ.

''చూడమ్మా, అక్క ఇది నా బ్రష్ కాదంటోంది'' అంటూ వచ్చాడు చిన్నాడు సీత దగ్గరకి.

''చూడు నాన్నా వాడు నా బ్రష్ తీసుకుని. వాడిదే అంటున్నాడు'' అంటూ పెద్ద పిల్ల రామం దగ్గరకి వచ్చింది.

దుబ్బులా ఉన్న చిన్నాడి జుట్టుని తన సన్నని, పొడవాటి వేళ్ళతో సవరించి - ''నీ బ్రష్ కలరేంటి'' అని అడిగింది సీత.

వాడు తన చేతిలోని బ్రష్ కలర్ సరిచూసుకుని బూ అన్నాడు.

''ఓరి భడవా? నీ చేతిలో ఉన్న బ్రష్ కలర్ చూసుకుని, ఆ కలరే చెప్తావా?'' అన్నాడు రామం.

''లేదు వాడి బ్రష్ కలర్ బ్లూయే'' అని రామంతో అని ''బూ కాదు నాన్నా బ్లూ'' అంది చిన్నాడితో సీత.

''నువ్వెపుడూ అంతే, వాణ్ణే వెనకేసుకొస్తావు'' అన్నాడు రామం.

''మీరు మీ ముద్దుల కూతుర్ని వెనకేసుకు రావడం లేదూ. దాని బ్రష్షేదో కూడా దానికి తెలియదు'' అని సీత ఏదో అనబోతుండగా, రామం సీతని ఇంకేం మాట్లాడ వద్దన్నట్లుగా గిల్లి -

''వెళ్ళండి, వెళ్ళి బ్రష్ చేసుకురండి'' అన్నాడు.

పెద్ద పిల్ల నెమ్మదిగా వెళ్ళింది. వెనకే వెళ్తూ చిన్నాడు రామాన్ని చిన్నగా కొట్టి -

''అమ్మనెందుకు గిల్లుతావు?'' అన్నాడు.

''చూశారా వాడు నన్నెంత జాగ్రత్తగా చూసుకుంటాడో'' అని రామానికి మాత్రం వినిపించేటట్లుగా అని, ''తప్పు నాన్నా, నాన్నని కొట్ట కూడదు'' అంది చిన్నాడితో సీత.

''వెళ్ళు, వెళ్ళి బ్రష్ చేసుకో'' అని చిన్నాడితో అని పంపించేసి రామం,


''వాడికి కొట్టడం గిల్లడం నేర్పిస్తావెందుకు'' అన్నాడు.

''నేనేం వాణ్ణే కొట్టమనలేదు. మీరే నన్ను కొట్టడం గిల్లడం చూసి నేర్చుకున్నాడు వాడు'' అంది సీత.

''నేను నిన్ను కొడతానా, గిల్లుతానా'' అన్నాడు రామం.

''ఇందాక గిల్లలేదూ'' అంది సీత.

''అదా, అది గిల్లడం కాదు. వాళ్ళ ముందు మనం వాళ్ళని గురించి మాట్లాడ కూడదని నీకు చెప్పాలనే అలా చేశాను'' అన్నాడు రామం.



# నేనూ నా పక్షులూ

ఎక్కడి నుండి వచ్చాయో
ఎగురుకుంటూ ఈ పక్షులు
ఇక్కడ అక్షరాల దానా ఏరుకుంటూ
ఈ తోటలో మకాం పెట్టాయి

వొద్దు నన్ను పిలవొద్దు నేనెక్కడికీ రాను
పక్షులకు పాఠాలు చెప్పే పంతుల్ని నేను
కుట్రలూ కుహకాలూ తెలీని పక్షులు
మాయా మర్మాలూ ఎరగని పక్షులు

పుస్తకం పుచ్చుకోని నేను
తోటలో అడుగు పెడతానో లేదో
పక్షులన్నీ ఎగిరొచ్చి
నా మీద పసిపసిగా వాల్తాయి
వొళ్ళంతా ఝల్లుమంటుంది
ఇంత దేహాన్ని కుదించుకుని కుదించుకుని
రక్తాన్ని మధించుకుని మధించుకుని
తేనెటీగలకు మధువులందించే తేనెపట్టవుతాను
వొళ్ళంతా స్తనాలు చేసుకుని
పక్షి కూనలకు పాలిస్తున్న తల్లి చెట్టవుతాను
శరీరంలోని రోమాలన్నీ జిహ్వాలుగా మార్చి
పక్షి కూనలను రక్తస్పర్శతో పలకరిస్తాను

గోముగా కువకువ లాడుతూ
రెక్కలు రెపరెప లాడుతూ
మౌన దృక్కులతో లేలేత ముక్కులతో
నా శరీరంలోని ప్రతి రంధ్రం నుండీ
జ్ఞాన ధారల్ని పీల్చుకుంటూ
నన్నే అంటిపెట్టుకుంటాయి నా పిచ్చి పిట్టలు
ఉన్నట్టుండి నన్నేవో పీడకలల పెను తుఫానులు
గజ గజ వణికిస్తుంటాయి
నల్లని కొండ చిలువల్లాంటి చేతి వ్రేళ్ళేవో
నాముందు నాట్యం చేస్తాయి

లోకమంతా ఒక నల్లని ప్రాణమున్న మసిగుడ్డ పీలికై
నా కాలి వ్రేళ్ళ సందుల్లోంచి
సర్రున రాసుకుంటూ వెళ్ళిపోతుంది

భయపడతాను
ఎక్కడ నా పిచ్చి తల్లులు
ఏ వొంటరి పోరాటంలో
రెక్కలు తెగి దిక్కులేక దీనంగా
మాష్టారూ! అంటూ నన్ను కలవరిస్తాయో అని
తత్తరపడి తడి కళ్ళతో
పిల్లల్ని తడిమి తడిమి చూచుకుంటాను
పక్షులన్నీ నాకు
సిద్ధార్థుడి కోసం ఎదురు చూస్తున్న
గాయపడ్డ హంసల్లాగే కనిపిస్తాయి.

అయ్యో! కనపడని బాణాల గురించి
నా పిల్లలకిప్పుడు ఎలా చెప్పను!
దేవుడా నా దేహాన్ని లోహంగా మార్చు
నన్ను నేను ముక్కలు ముక్కలుగా చేసుకుని
మా పిల్లలకు కవచాలు తయారు చెయ్యాలి!!

– బి. ఆర్. వి. ప్రసాదమూర్తి

''అది వాడికి తెలుస్తుందా'' అని అడిగింది సీత.

''తెలియదు''

''ఇవే కావు వాళ్ళకి ఎన్నో తెలియవు. మనం జాగ్రత్తగా నేర్పించాలి'' అంది సీత.

''అవును'' అన్నాడు రామం

''వాళ్ళిద్దర్నీ చూస్తే, నాకు ఇందాక మనం పెళ్ళి చేసుకుని ఏదో పోగొట్టుకున్నాం, ఏమీ సాధించ లేకపోయాం, అని ఎందుకు అనుకున్నామా అనిపిస్తోంది. మనం ఏదీ పోగొట్టుకోలేదు. ఇద్దరు పిల్లల్ని పొందాం. వీళ్ళు జీవితంలో ఏదన్నా సాధిస్తే మనం సాధించినట్లే'' అంది సీత.

''అవును'' అంటూ రామం తన తలని సీత తల మీదకి వాల్చాడు. సీత తన తలని రామం తల మీదకి వాల్చుకుంది.

ఇద్దరి మొహాల్లోనూ తృప్తి!

ఒకే రకం తృప్తి!!